## విద్యార్థుల్లో సామర్థ్యాలను
# పెంపొందించాలి

- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి
- డీఈవో రామారావు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 2 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు సూచించారు. శనివారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి వారీగా కేటాయించిన పిరియడ్స్‌ను, బోధన పద్ధతులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత కాల పరిమితి ప్రకారం. పాఠ్యాంశాల బోధన ఉండాలని, ప్రతి పాఠ్యాంశంను విద్యార్థులకు అర్థమ య్యేలా వివరించాలని సూచించారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ సదయ్య, సీఆర్పీ వీరన్న, పాఠశాల హెచ్‌ఎం భద్రూనాయక్, ఉపాధ్యాయులు మౌనిక, కృష్ణమూర్తి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టయ్యకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

### పోలీస్ కిష్టయ్యకు నివాళి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) టీఎస్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ పాల్గొని కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించి, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు సింగారాపు రామకృష్ణ, నీరటి రాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల నాయకులు అమ్మగారి రాకేశ్‌వర్మ, గోనెల శ్యామ్, ఈరబోయిన రాకేశ్, ఈరబోయిన రోహిత్, దువ్వ దిలీప్, రావుల ప్రశాంత్, అమ్మగారి మోహన్, ఈరబోయిన వినోద్, చేతన్ వర్మ, బోళ్ల శ్యామ్, రావుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



దేవాలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

### రైల్వే దేవాలయంలో అన్నదానం

కాజీపేట, డిసెంబర్ 2 : కాజీపేట రైల్వే జంక్షన్ సముదాయంలోని శ్రీ హరిహర పుత్ర శ్రీధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన (భిక్ష) కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అర్చకుడు, గురుస్వామి ఉడుతల శ్రీనివాస్ శర్మ నేతృత్వంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బుర్ర జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ స్వాములందరికి మండల కాలంలో రోజు దాతల సహకారంతో భిక్షను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన టోకెన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 28 వరకు ఏర్పాటు చేసే ఈ భిక్షను స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు ఒర్సు యాకయ్య, పిల్లల కుమారస్వామి, ఆవాల పురుషోత్తం, అరూరి సాంబయ్య, నటరాజ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, కొండ రాజేందర్, నళినీకాంత్, కోటగిరి సాంబయ్యస్వామి పాల్గొన్నారు.

### 'సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

కాజీపేట, డిసెంబర్ 2 : ఆపద సమయంలో మహిళలు, బాలికలు సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖీ వన్‌స్టాప్ కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. కాజీపేట సోమిడిలో సఖీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖీ వన్ స్టాప్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విడిపోయే భార్య భర్తలను కౌన్సెలింగ్‌తో ఒకటి చేయడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి తదితర వేధింపుల నుంచి రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. 0870-2452112, టోల్ ఫ్రీ నంబర్ 181లో సంప్రదించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, హరిత పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సరిత

నర్సింహులపేట, డిసెంబర్ 2 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బీ సరిత సూచించారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమానికి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆనందబాబు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ న్యాయపర అంశాలు తెలియక గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే గ్రామాల్లో ఉచిత న్యాయ సలహాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు తప్పవన్నారు. బాలికలు ధైర్యంగా ఉండాలని చిన్న తనంలో వివాహం జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు బీ లాలు, ఉపాధ్యక్షుడు అశోక్, లాయర్లు రామకృష్ణ, శ్రీను, గౌస్, ఎస్సై సతీశ్, కోర్టు కానిస్టేబుల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కన్నెగుండ్ల ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సిబ్బంది, రైతులు

డోర్నకల్, డిసెంబర్ 2: వెన్నారం, కన్నెగుండ్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం రూ. 2203, సాధారణ రకం రూ.2183 మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చంద్రకళ, నాగరాజు, రేణుక పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపు

మరిపెడ, డిసెంబర్ 2 : డోర్నకల్ శాసనసభ ఎన్నికల ఫలితాలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్సింహారావు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందన్నారు. 14 టేబుల్స్ ఏర్పాటు చేసి, 21 రౌండ్ల ఓట్లు లెక్కిస్తారన్నారు. మైక్రో అబ్జర్వర్ ఆఫీసర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, సూపర్ వైజర్లు, సెక్టోరల్ అధికారులు లెక్కింపులో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం.. బహిరంగ ర్యాలీలు, పటాకులు కాల్చడం తదితర కార్యక్రమాలకు అనుమతి లేదన్నారు.

## ఎవరి ధీమా వారిదే..

**ఓట్ల లెక్కల్లో మునిగి తేలుతున్న అభ్యర్థులు**

నర్సింహులపేట, డిసెంబర్ 2 : నామినేషన్లు వేసిన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రచారాలు, మైకులు, జెండాలు, కండువాలు ఇలా ప్రతి దానికి చేసిన ఖర్చులతో పాటు చివరి అంకంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇచ్చిన డబ్బుల లెక్కలు చూసుకుంటున్నారు. ఆ మేరకు ఓట్లు పడలేదని లెక్కలు వేసుకొని గుండెలు బాదుకునే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. ముందస్తుగానే ఎన్నికల కోసం డబ్బు జమ చేసి పెట్టుకోగా, రోజు రోజుకూ వ్యయం పెరగడంతో పాటు అందిన కాడికి అప్పులు తెచ్చారు. అభ్యర్థులంతా పేపరు, పెన్నులు పట్టుకొని పోలింగ్ ఏజెంట్లతో సమావేశమై ఈవీఎంలో ఉన్న ఓట్లను తమకు ఎన్ని పడ్డాయో చర్చించుకుంటున్నారు. ఎన్నికలు పూర్తి కావడంతో అభ్యర్థులు పెట్టిన ఖర్చులు, వారికి పడిన ఓట్ల చూసుకుంటుండగా ప్రజలు మాత్రం ఎన్నికల్లో ఎవరు గెలవబోతున్నారనే దానిపై ఎక్కడ చూసినా చర్చలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే అభ్యర్థులు మాత్రం ఎవరికి వారే 5 నుంచి 10 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎక్కడ గుమిగూడినా ఆ అభ్యర్థికి అంత సీన్ లేదని ఓట్లు పడవని, పలానా అభ్యర్థి గెలువడం ఖాయమని చర్చించుకుంటూ చాలెంజు చేస్తున్నారు.

**ఏ నలుగురు కలిసినా.. ఆ ముగ్గురి ముచ్చటే..**

మరిపెడ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ నలుగురు గుమిగూడినా ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్న ఆ ఇద్దరి గురించే.. మాట్లాడుకుంటున్నారు. శాసన సభ ఎన్నికలు గురువారం పూర్తి కాగా.. ఎక్కడ చూసినా ఎవరూ గెలవబోతున్నారనే దానిపైనే చర్చలు చేస్తున్నారు. నిలబడ్డ అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓటమి పాలవుతారంటూ చర్చించుకుంటున్నారు. ఒక ప్రాంతం వారు మరో ప్రాంతానికి ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. డోర్నకల్ సిట్టింగ్ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్, కాంగ్రెస్ నుంచి రామచంద్రునాయక్ మధ్య ప్రధాన పోటీదారులుగా ఉండగా బీజేపీ తరఫున పోటీచేసిన సంగీత ప్రచారంలోనే వెనుకబడినట్లు ఆపార్టీ వారే బహిరంగానే విమర్శిస్తున్నారు. ఇద్దరిలో ఎవరు గెలుస్తున్నారనే దానిపై విపరీతమైన చర్చ జరుగుతున్నది.

## నిబంధనలు పాటించాలి

**సీఐ ఉపేందర్ రావు**

డోర్నకల్, డిసెంబర్ 2 : ఈ నెల 3న ఆదివారం ఎలక్షన్ కౌంటింగ్ ఉన్నందున ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు.. 144 సెక్షన్ అమలులో ఉంటుందని డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ ఉపేందర్ రావు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు సందర్భంగా ర్యాలీలు నిర్వహించొద్దని, డీజేలు ఉపయోగించవద్దన్నారు. పటాకులు కాల్చొదని తెలిపారు. నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండవద్దన్నారు. ఎటువంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయవద్దన్నారు. ఎన్నికల ఫలితాలు తర్వాత ఎలక్షన్ కమిషన్ అనుమతితో మాత్రమే విజయోత్సవం ర్యాలీ నిర్వహించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**కురవిలో..**

కురవి: ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ గోపి సూచించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సందర్భంగా రాజకీయ నాయకులు విజయోత్సవానికి ర్యాలీలు, డీ జేలు ఉపయోగించవద్దన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి మేరకు విజయోత్సవం ర్యాలీ నిర్వహించాలని సూచించారు.

**గార్లలో..**

గార్ల: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సందర్భంగా రాజకీయ నాయకులు విజయోత్సవంకు ర్యాలీలు, డీజేలు ఉపయోగించవద్దని ఎస్సై వెంకన్న శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు.. 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న సీఐ బాబురావు

**కేసముద్రంలో..**

కేసముద్రం: ఎన్నికల నిభంధనల మేరకు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, బైక్ ర్యాలీ, పటాకులకు అనుమతి లేదని ఎస్సై తిరుపతి శనివారం తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**బయ్యారంలో..**

బయ్యారం: ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, బైక్ ర్యాలీ, పటాకులకు అనుమతి లేదని గార్ల, బయ్యారం సీఐ బాబురావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కేసముద్రం, డిసెంబర్ 2: మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన సత్యా నందం ఇటీవల మృతి చెందాడు. కాగా, విషయం ఆయన కుటుంబానికి మాజీ మార్కెట్ చైర్మన్ మర్రి నారాయణరావు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రూ. 22,500లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట ఉపేందర్, మహ్మద్ అలీ, నర్సయ్య, లెంకలపల్లి చంద్రయ్య, ఇంద్రారెడ్డి, లక్ష్మయ్య, సత్యం, రామ్మోహన్ ఉన్నారు.